సాక్షి
ఖమ్మం
గురువారం । 21 । నవంబర్ । 2024



..నిర్లక్ష్యం వద్దు
ఆహార భద్రతా చట్టం అమలు, పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దని కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి ఆదేశించారు. 8లో



పింఛన్ల సాధనకు ఉద్యమం
ప్రభుత్వ హామీ మేరకు పింఛన్ నగదు పెంచాలనే డిమాండ్‌తో చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ తెలిపారు. 8లో



వాతావరణం
జిల్లాలో గురువారం చలిప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం తర్వాత చలిగాలుల తీవ్రత మరింతగా పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఎంపీడీఓ బాధ్యతల్లో అసిస్టెంట్ కలెక్టర్



విధుల్లో చేరుతున్న మ్రిణాల్ శ్రేష్ఠ

కూసుమంచి: ఐఏఎస్ శిక్షణలో భాగంగా జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా కొనసాగుతున్న మ్రిణాల్ శ్రేష్ఠ బుధవారం కూసుమంచి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. శిక్షణలో భాగంగా ఆయన మూడు వారాల పాటు ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తారు. ఈసందర్భంగా మ్రిణాల్‌కు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్‌రావు, ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం మండల భౌగోళిక స్వరూపం, గ్రామపంచాయతీలు వివరాలతో పాటు ఈజీఎస్ పనులు, సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్షించారు.

నేడు, రేపు మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి హరీశ్‌రావు గురు, శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో తెలిపారు. లగచర్ల గిరిజనులకు సంఘీభావంగా గురువారం సాయంత్రం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుండి జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ సెంటర్ వరకు సాగే ర్యాలీలో హరీశ్‌రావు పాల్గొంటారని వెల్లడించారు. అలాగే, శుక్రవారం ఉదయం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మిర్చి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ఆతర్వాత బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడతారని తెలిపారు. మధ్యాహ్నం చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబంతో పాటు ఇటీవల జైలుకు వెళ్లొచ్చిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పరామర్శించడమే కాక చింతకాని మండలం లచ్చగూడెంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో మృతి చెందిన రైతు గూని ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు.

వచ్చే నెల 3వరకు ఫీజు గడువు

ఖమ్మం సహకారనగర్: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ(టీసీసీ) లోయర్, హయ్యర్ అభ్యర్థులు అపరాధ రుసుము లేకుండా వచ్చే నెల 3వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. అలాగే, రూ.50 అపరాధ రుసుముతో వచ్చేనెల 10వరకు, రూ.75 అపరాధ రుసుముతో వచ్చేనెల 17వరకు ఫీజు చెల్లించే అవకాశముందని తెలిపారు.www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించాక దరఖాస్తు కాపీ, విద్యార్హత సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ సూచించారు.

రెండో విడతలో చేపపిల్లల పంపిణీ ప్రారంభం



చేపపిల్లలను వదులుతున్న మత్స్య శాఖాధికారి శివప్రసాద్, తదితరులు

నేలకొండపల్లి: జిల్లాలో రెండో విడత చేపపిల్లల పంపిణీని ప్రారంభించినట్లు జిల్లా మత్స్యశాఖాధికారి శివప్రసాద్ తెలిపారు. మండలంలోని చెరువుమాధారంలో చెరువులో 2.60 లక్షల చేపపిల్లలను బుధవారం విడుదల చేశాక ఆయన మాట్లాడారు. ఇప్పటికే మొదటి విడతగా 876 చెరువుల్లో 1.72 కోట్ల చేపపిల్లలు వదిలినట్లు తెలిపారు. ఇక రెండో విడతలో 276 చెరువులకు 1.07 కోట్ల పిల్లలు అందిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో బలోపేతం కావాలని సూచించారు. చెరువుమాధారం మత్స్య సొసైటీ అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వే... చకచకా



ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ నర్సింహారావు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో ఊపందుకుంది. ఈనెల 8న సర్వే ప్రారంభమైంది. అయితే, తొలినాళ్లలో వివరాల సేకరణ, కోడ్ల ఆధారంగా నమోదులో ఎన్యుమరేటర్లు.. వివరాలు చెప్పేందుకు ఇళ్ల యజమానులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. కానీ ఆ పరిస్థితులన్నీ చక్కబడడంతో ఎన్యుమరేటర్లు సర్వేలో వేగం పెంచారు. జిల్లాలోని 21 మండలాలకు గాను 5,66,894 ఇళ్లలో వివరాలు సేకరించాల్సి ఉండగా, బుధవారం నాటికి 3,89,074 గృహాల్లో సర్వే పూర్తయింది. మిగిలిన ఇళ్లలోనూ గడువులోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లాలో వేగంగా ఇంటింటి కుటుంబ సర్వే

- గడువులోగా పూర్తిచేసేలా అధికారుల పర్యవేక్షణ
- తొలినాళ్లతో పోలిస్తే మెరుగైన ప్రక్రియ
- ఇప్పటి వరకు 3,89,074 ఇళ్లలో పూర్తి

ఈనెల 6 నుంచి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ఈనెల 6 నుంచి ఇళ్లకు స్టిక్కర్లు వేయడం మొదలుపెట్టారు. తొలి రెండు రోజులు ఈ ప్రక్రియ కొనసాగగా 8వ తేదీ నుంచి ఎన్యుమరేటర్లు సర్వే ప్రారంభించారు. మొత్తం 75 ప్రశ్నలకు ఇంటి యజమానుల నుంచి సమాధానాలు రాబట్టాల్సి ఉండగా కొన్ని వివరాలు చెప్పేందుకు పలువురు నిరాకరించారు. రాజకీయ, వ్యక్తిగత ప్రశ్నలపై చాలా మంది అభ్యంతరం చెప్పారు. అయితే ఎన్యుమరేటర్లు సర్దిచెబుతుండడం, ప్రభుత్వం, ఉన్నతాధికారులు కూడా వివరాలేమీ బయటకు వెల్లడించబోమని స్పష్టత ఇవ్వడంతో యజమానులు ముందుకొస్తున్నారు.

చిన్నచిన్న సమస్యలు ఉన్నా..

జిల్లాలో సర్వే ఈనెల 8నుంచి మొదలుకాగా 3,719 మంది ఎన్యుమరేటర్లు, 314 మంది సూపర్‌వైజర్లను నియమించారు. బుధవారానికి సర్వే మొదలై 13 రోజులైంది. మొదటి రెండు, మూడు రోజులు ఎన్యుమరేటర్లు ఇబ్బందులు పడ్డారు. అయితే సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తూ వారికి సలహాలు ఇస్తుండడంతో సర్వే సజావుగా సాగుతోంది. కాగా, కొందరి ఇళ్లకు వెళ్లినప్పుడు యజమానులు లేకపోవడంతో సమస్య ఎదురవుతోంది. అసలే 75 ప్రశ్నలతో సమయం సరిపోవడం లేదని భావిస్తుండగా యజమానులు లేని ఇళ్లకు ఒకటి, రెండు సార్లు వెళ్లాల్సి ఉండడం భారమవుతోందని చెబుతున్నారు. ఇక ఇళ్లకు అంటించిన స్టిక్కర్లు ఊడిపోతున్నాయి. వీటిలో కొన్నింటిని యజమానులు అతికిస్తుండగా.. పలు ప్రాంతాల్లో ఇళ్లకు వేసిన స్టిక్కర్లు కానరావడం లేదు.

68.63 శాతం పూర్తి

జిల్లాలోని 21 మండలాల్లో 5,66,894 ఇళ్లను గుర్తించగా 4,129 ఎన్యుమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు. ఇప్పటివరకు 3,89,074 ఇళ్లను ఎన్యుమరేటర్లు సందర్శించి వివరాలు నమోదు చేయడంతో బుధవారం నాటికి 68.63 శాతం పూర్తయింది. కొన్ని ప్రాంతాల్లో సర్వే మందకొడిగా సాగుతున్నా, సిబ్బంది, యజమానులకు అవగాహన పెరగడంతో ఇంకొన్ని ప్రాంతాల్లో మాత్రం వేగం పుంజుకుంది. మరో 9రోజుల్లో దాదాపు 1,77,820 ఇళ్లల్లో సర్వే చేయాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజనం తర్వాత సర్వేకు వెళ్తుండగా అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్పీలు, జూనియర్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, సీఆర్పీలు ఇతర సిబ్బంది కూడా పాల్గొంటున్నారు.

గడువులోగా పూర్తి చేయాల్సిందే..

సమగ్ర సర్వేను ప్రభుత్వం ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించింది. సర్వే ప్రారంభమై బుధవారానికి 13రోజులు పూర్తి కాగా, మరో తొమ్మిది రోజుల గడువు ఉంది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తోపాటు ఇతర జిల్లాస్థాయి అధికారులు సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగంగా పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన నేపథ్యాన మరింత వేగంగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.



సర్వే చేయాల్సిన ఇళ్లు	గ్రామీణ ప్రాంతాలు	పట్టణ ప్రాంతాలు	ఎన్యుమరేటర్లు	సూపర్‌వైజర్లు
5,66,894	3,71,715	1,95,179	3,719 మంది	314 మంది

వివరాలు..

సర్వే పూర్తయిన ఇళ్లు	గ్రామీణ ప్రాంతాలు	పట్టణ ప్రాంతాలు	శాతం
3,89,074	2,80,315	1,08,759	68.63

కేఎంసీలో ప్రక్షాళనకు అడుగులు

- సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల విభాగాల మార్పు
- ఔట్ సోర్సింగ్ సిబ్బందిపైనా దృష్టి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పాలనపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తీరుతో విమర్శలు వస్తుండడంతో ప్రక్షాళనకు కమిషనర్ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఏళ్లుగా ఒకే విభాగంలో పాతుకుపోయిన ఉద్యోగులను మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఎస్టాబ్లిష్‌మెంట్, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, అకౌంట్స్ తదితర విభాగాల రెగ్యులర్ ఉద్యోగులను ఇతర విభాగాల్లోకి మార్చేలా జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సెలవుపై వెళ్లి రాగానే ఈ అంశంపై దృష్టి సారించడంతో విధుల్లో అలసత్వం వహించడమే కాక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు చెక్ పడనుందని చెబుతున్నారు.

ఔట్ సోర్సింగ్ పై ఫోకస్..

కేఎంసీలో లెక్కకు మించి ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో కొందరు విధులకు హాజరుకాకుండానే వేతనాలు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఇక కంప్యూటర్ ఆపరేటర్లుగా చలామణి అవుతున్న సిబ్బందిలో పలువురికి అవగాహన లేకుండానే కొనసాగుతున్నట్లు సమాచారం. ఇటీవల వరదల సమయాన ఆపరేటర్లకు డేటా ఎంట్రీ పనులు అప్పగిస్తే తాము చేయలేమని చేతులెత్తేయడంతో విషయం బయటపడింది. దీంతో వీరిని పక్కన పెట్టాలని నిర్ణయిస్తున్నట్లు సమాచారం. అలాగే, ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో పలువురిపై అవినీతి ఆరోపణలు రావడంతో విభాగాలు మార్చాలని కమిషనర్ నిర్ణయించినట్లు తెలిసింది.

సంఘాల నేతలు క్యూ..

పనిచేయకుండా ఖాళీగా ఉంటున్న సిబ్బందితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విభాగాలు మార్చేందుకు అధికారులు జాబితా సిద్ధం చేస్తున్న విషయం బయటకు పొక్కింది. దీంతో వారిని కదిలించొద్దని కార్మిక సంఘాల నాయకులు కేఎంసీ కార్యాలయానికి వస్తుండడంపై అధికారుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఉద్యోగులతో పని చేయించుకోకుండా నాయకులు అడ్డు తగులుతుండడంపై ఆగ్రహంగా ఉన్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మార్పులకు పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది.

స్వామియే శరణం అయ్యప్పా...

శరణుఘోషతో మార్మోగిన సత్తుపల్లి

సత్తుపల్లి: స్వామియే శరణం అయ్యప్పా అంటూ మాలధారుల శరణుఘోషతో సత్తుపల్లి మార్మోగింది. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యాన స్థానిక శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. కేరళకు చెందిన మేలుతంత్రి చంద్రమౌళి వెంకటేష్‌శర్మ ఈ పూజ నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటు సత్తుపల్లి, అశ్వారావుపేట, చింతలపూడి, విస్సన్నపేట ప్రాంతాల నుంచి వందలాది మంది మాలధారులు హాజరయ్యారు. అలాగే, ద్రోణంరాజు మల్లికార్జున స్వామి, సుబ్బారావు బృందాల సంకీర్తనలు, భజనలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకులు దోసపాటి అమరలింగేశ్వరరావు, వందనపు సత్యనారాయణ, శ్రీను, పోలిశెట్టి శివకుమార్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, పర్వతనేని వేణు, కిషోర్‌రెడ్డి, కూసంపూడి రామారావు, బొంతు శ్రీనివాసరావు, క్రాంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర, మాలధారులు

జైళ్ల శాఖ ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకే రీట్రీట్



రీట్రీట్‌లో మాట్లాడుతున్న డీఐజీ సంపత్

ఖమ్మంరూరల్: జైళ్లశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడంతో పాటు వారిలో ఉత్సాహాన్ని నింపేందుకే రీట్రీట్ నిర్వహిస్తున్నామని జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెంలో బుధవారం వరంగల్ రేంజ్ ఉద్యోగులకు బుధవారం ఏర్పాటుచేసిన రీట్రీట్‌లో డీఐజీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉద్యోగుల వారీగా సమస్యలు తెలుసుకున్న ఆయన పరిష్కారంపై భరోసా కల్పించారు. కాగా, జైళ్లు గతంలో మాదిరి కాకుండా నేరస్తుల్లో పరివర్తన తీసుకొచ్చే ఆశ్రమాలుగా మారాయని తెలిపారు. జైలు నుండి బయటకు వెళ్లేలోగా ముద్దాయిలు ఉపాధి పొందేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఖమ్మం జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్‌తో పాటు రేంజ్ పరిధిలోని జైళ్ల అధికారులు టి.కళాసాగర్, జి.విజయ్ డేని, జి.వెంకటేశ్వర్లు, ఏ.సక్రునాయక్, జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ వినియోగంలో అప్రమత్తత తప్పనిసరి

ఖమ్మంవన్‌టౌన్: ఇంటర్‌నెట్ వినియోగం తప్పనిసరైన పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని సైబర్‌సెల్ డీఎస్పీ ఫణీందర్ సూచించారు. స్కోప్ ఆర్డీ స్వచ్ఛంద సంస్థ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం టీటీడీసీ భవనంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత విద్యావిధానంలో బాలబాలికలు ఇంటర్‌నెట్ వినియోగించక తప్పడం లేదని, ఈ సమయాన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత మేలు చేస్తుందో అదే స్థాయిలో కీడు పొంచి ఉందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి విష్ణువందన మాట్లాడుతూ ఇంటర్‌నెట్ వినియోగం, ఆన్‌లైన్ వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. స్కోప్ ఆర్డీ డైరెక్టర్ ఎం.ఎల్.ప్రసాద్ మాట్లాడగా సైబర్ క్రైమ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రంజిత్‌కుమార్, బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు డి.లింగయ్య, సీడీపీఓ వీరభద్రమ్మతో పాటు నర్సింహారావు, భాస్కర్, రాజకుమారి, సమ్రిన్, ప్రమీల, ప్రభావతి, యశోద, సుజాత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ఫణీందర్

శంకర్‌దాదా.. ఆర్ఎంపీలు !

- అత్యవసర కేసులకూ స్థాయికి మించి వైద్యం
- కమిషనరేట్ పరిధిలో 41 మందిపై కేసులు
- అధికారుల పర్యవేక్షణ కరువవడంతో యథేచ్ఛగా క్లినిక్‌ల నిర్వహణ



ఖమ్మంవైద్యవిభాగం: ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. కానీ జిల్లాలోని పలువురు వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాల మీదకు తీసుకొస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఓపెన్ హార్ట్ సర్జరీ తప్ప మిగతా చికిత్సలన్నీ అంతా తమకు తెలుసంటూ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదకర వ్యాధులు, అత్యవసర కేసులకు వైద్యం చేయడం మూలంగా చాలాసార్లు అది వికటించి బాధితులు మృతి చెందుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నాయకుల సహకారంతో మృతుల కుటుంబాలతో నయానో, భయానో ఒప్పందాలు చేసుకుని కేసుల వరకు వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ తరుణంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇటీవల కొద్దికాలంగా విస్తృత తనిఖీలు చేపట్టిన పోలీసులు 41మంది ఆర్ఎంపీలు, పీఎంపీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మెడికల్ షాపులు, ఆపై క్లినిక్‌లు

జిల్లాలో సుమారు 1,500 మంది వరకు ఆర్ఎంపీలు, పీఎంపీలు ఉంటారని అంచనా. వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ లేని వారెవరూ అల్లోపతి మందులు రాయకూడదని నిబంధనలు చెబుతున్నాయి. వీటిని అతిక్రమిస్తే ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5లక్షలు జరిమానా ఉంటుందని హెచ్చరించినా పలువురి తీరు మారడం లేదు. ఈనేపథ్యాన కమిషనరేట్ పరిధిలో పోలీసులు 41 మంది ఆర్ఎంపీలు, పీఎంపీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అర్హతకు మించి వైద్యం చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఫిర్యాదులు అందడంతో ఎన్ఎంసీ చట్టం 34,54 ప్రకారం ఈ కేసులు నమోదు చేశారు. చాలామంది తొలుత మెడికల్ షాపు ఏర్పాటుచేయడం.. ఆపై మూడు, నాలుగు పడకలతో ఆస్పత్రిగా మారుస్తున్నారని తెలుస్తోంది. కొందరు ఏకంగా ప్రసవాలు చేయడంతో పాటు అబార్షన్ల ద్వారా భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడశిశువు వద్దనుకునే వారికి సహకరిస్తూ పలువురు సొంతంగా అబార్షన్లు చేస్తుండగా మరికొందరు ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసి కమీషన్లు దండుకుంటున్నారు. అలాగే గర్భిణులు, చిన్నపిల్లలకు చికిత్స చేయొద్దనే నిబంధనలు ఉన్నా ఎవరూ పాటించిన పాపాన పోవడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ కొరవడటంతో ఆర్ఎంపీలు, పీఎంపీలు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే, కేసులు పెట్టినప్పుడు కొన్నాళ్లు జాగ్రత్త పడడం.. ఆపై యథావిధిగా కొనసాగించటం సాధారణమైపోయింది.

నిబంధనలు ఉన్నా పట్టింపేదీ?

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అనే పదాన్ని వాడొద్దు. అలాగే చీటీలపై మందులు రాయడం, మందులు అమ్మడం నిషేధం. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఆర్ఎంపీలే మందులు చిటీలు రాయటం, సొంత షాపుల ద్వారా మందులు అమ్మడం.. ప్రథమ చికిత్స కేంద్రం అని కాకుండా క్లినిక్‌ల పేరిట బోర్డులు ఏర్పాటుచేసి పేరు ముందు డాక్టర్ అని రాసుకోవడం పరిపాటిగా మారింది. ఎవరైనా తమను ఆశ్రయిస్తే ప్రథమ చికిత్స చేసి అత్యవసరమైతే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలే తప్ప ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దు. కానీ చాలా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు వీరిపై ఆధారపడుతూ బిల్లులో 30 నుండి 50 శాతం మేర కమీషన్ ఇస్తున్నారు. దీంతో వీరి ఆగడాలు మూడు పూలు, ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతున్నాయి. పోలీసు కేసులు నమోదైన నేపథ్యాన వైద్య, ఆరోగ్యశాఖాధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని పలువురు కోరుతున్నారు.



ఆస్పత్రిలో భార్యాభర్తలు లావణ్య, శ్రీను

ఆమె.. ఆయనలో సగభాగం

భర్తకు కాలేయదానం చేసిన భార్య

రఘునాథపాలెం: వివాహం జన్మజన్మల అనుబంధమని, చెరోసగంగా భార్యాభర్తలు జీవనం సాగించడం అన్యోన్య దాంపత్యమని పెద్దలు చెబుతారు. ఈ తరహాలోనే ఓ మహిళ తన భర్తను బతికించుకునేందుకు కాలేయదానం చేసి ఆయనలో సగభాగంగా మారడమే కాదు.. కలకాలం కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని పెళ్లి రోజున చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి నిలిచినట్లయింది. రఘునాథపాలెం మండలం పెద్ద ఈర్లపూడికి చెందిన ధారావత్ శ్రీను ఖమ్మంలోని ఏపీజీవీబీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య లావణ్య ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం చదువుతుండగా వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నాళ్ల క్రితం శ్రీను అనారోగ్యం బారిన పడడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. కామెర్లు సోకగా కాలేయం సమస్య ఎదురైందని వైద్యులు గుర్తించారు. ఆపై హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. అంతేకాక వివిధ పరీక్షల అనంతరం కాలేయ మార్పిడి మాత్రమే శ్రీనును బతికిస్తుందని వైద్యులు తేల్చిచెప్పారు. దీంతో కాలేయదానం చేసే వారి కోసం ఆరా తీస్తుండగా లావణ్యే ముందుకొచ్చింది. తన భర్తను కాపాడుకోవడానికి లివర్ ఇస్తానని చెప్పడంలో పరీక్షలు చేసిన వైద్యులు సరిపోతుందని నిర్ధారించారు. ఈ మేరకు లావణ్య లివర్ నుంచి 65శాతం మేర తీసిన సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఈనెల 16న శస్త్రచికిత్స ద్వారా శ్రీనుకు అమర్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ ఆరోగ్యంగా ఉండగా కోలుకుంటున్నారని కుటుంబీకులు తెలిపారు.



కుమార్తెలతో శ్రీను - లావణ్య

క్లుప్తంగా

ఎత్తిపోతల పథకానికి టెండర్ల స్వీకరణ

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలంలో సాగు భూములకు సాగర్ జలాలు అందించేలా ప్రధాన కాల్వపై ఎత్తిపోతల పథకం నిర్మించాలని నిర్ణయించిన విషయం విదితమే. మండలంలోని వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాలువలపై ఈ లిఫ్టును నిర్మించనున్నట్లు ఇందుకోసం రూ.66 కోట్లు కేటాయించగా జలవనరుల శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. ఈనెల 28వ తేదీ వరకు టెండర్ల దాఖలకు గడువు విధిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

24న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జూనియర్స్ విభాగంలో జిల్లా స్థాయి బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికకు ఈనెల 24న పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పాటిబండ్ల రఘునందన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

30 వాహనాల సైలెన్సర్లు తొలగింపు, జరిమానా



సైలెన్సర్లు తొలగించిన వాహనాల వద్ద సీఐ, ఉద్యోగులు

ఖమ్మంక్రైం: వాహనాల కొనుగోలు సమయాన వచ్చిన సైలెన్సర్లను తొలగించి వింత శబ్దాలు చేసేవి బిగిస్తున్న వారిపై అందుతున్న ఫిర్యాదులతో ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ఈమేరకు రెండో రోజైన బుధవారం కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా 30మంది వాహనాల నుంచి సైలెన్సర్లను తీయించారు. అంతేకాక ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన



బీరోలులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా, బీరోలులో పత్తి, ధాన్యం కొనుగోలు కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17లోపు ఉంటే వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే, సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్ల వివరాలు ఆరా తీయడంతో పాటు తేమ శాతాన్ని పరీక్షించారు. అనంతరం బీరోలు పాఠశాలను తనిఖీ చేసిన డీఏఓ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మెనూ అమలుపై ఆరా తీశారు. మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు అడ్డగింత

వైరా: వైరా శాంతినగర్‌లో ఎక్సైజ్ శాఖ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం మూడేళ్ల క్రితం స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలాన్ని ఆనుకుని బుధవారం మున్సిపాలిటీ అధికారులు రహదారి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ మమతరెడ్డి ఫిర్యాదుతో పోలీసులు చేరుకుని జేసీబీని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ చింతల వేణును వివరణగా అడగగా.. ఎమ్మెల్యే ఆదేశాలతో రోడ్డు నిర్మాణం మొదలుపెట్టామని తెలిపారు. ప్రజావసరాల కోసం చేపడుతున్న పనుల విషయమై ఎక్సైజ్ అధికారులు పునరాలోచన చేయాలని కోరారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన ఖమ్మం టేకులపల్లికి చెందిన దేవరకొండ తిరుపతిరావుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.4.80 లక్షలు ఫిర్యాదికి అందజేయాలని ఖమ్మం ఆబ్కారీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం బ్యాంక్ కాలనీకి చెందిన కొత్త సుదర్శన్‌రెడ్డి వద్ద తిరుపతిరావు 2014 మే 11న రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆతర్వాత 2016 నవంబర్ 26న రూ.4.80లక్షలకు చెక్కు జారీ చేయగా బ్యాంకులో జమ చేస్తే ఖాతాలో నగదు లేనందున బౌన్స్ అయింది. ఈమేరకు న్యాయవాది బండారుపల్లి గంగాధర్ ద్వారా లీగల్ నోటీసు పంపిన సుదర్శన్‌రెడ్డి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం తిరుపతిరావుకు ఏడాది జైలు శిక్ష విధించడమే కాక నగదు చెల్లించాలని తీర్పు చెప్పారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144



వైరా: ఎంఎల్ఎస్ పాయింట్‌లో పరిశీలిస్తున్న ఆహార భద్రతా కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వద్దు..

- చట్టం అమలులో నిర్లిప్తత విడనాడాలి
- గోదాంలు, పాఠశాలల్లో ఆహార భద్రతా కమిషన్ బాధ్యుల తనిఖీ

వైరా: ప్రజలకు పౌష్టికాహారం పంపిణీ ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ సభ్యులు వి.ఆనంద్, బి.జ్యోతి హెచ్చరించారు. వైరా వ్యవసాయ మార్కెట్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం వారు తనిఖీ చేశారు. నిల్వ ఉన్న బియ్యం, పంచదార వివరాలు తెలుసుకున్న వారు పంచదార పంపిణీ చేయకుండా పక్కన పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ ఆహార భద్రత చట్టం అమలుపై ఆరాతీసేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ పౌష్టికాహారాన్ని అందించడమే ఆహార భద్రత చట్టం ఉద్దేశమని, ఈ విషయంలో అధికారుల జాగ్రత్తలు వహించాలని సూచించారు.

■ కొణిజర్ల: బాలికల ఆరోగ్యం విషయంలో ఉపాధ్యాయులు, సిబ్బంది శ్రద్ధ వహిస్తూ వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం సమకూర్చాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి సూచించారు. కొణిజర్ల సమీపాన బస్వాపురంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన వారు విద్యార్థినులతో మాట్లాడగా బియ్యం సరిగా లేక భోజనం తినలేకపోతున్నామని తెలిపారు. అలాగే, పలువురు బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు చెప్పారు. అనంతరం వంట గదిలో పరిశీలించగా మెనూ చార్ట్ ఉండడంపై ఆగ్రహించిన వారు డైనింగ్ హాల్‌కు మార్చాలని సూచించారు. తొలుత కొణిజర్ల పీహెచ్‌సీలో పరిశీలించినవారు రోజువారీ ఓపీ, ప్రసవాలపై సంఖ్యపై ఆరాతీశారు.



ఏన్కూరు : అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు ఆనంద్, జ్యోతి

■ ఏన్కూరు: పాఠశాలల్లో బాలికలకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని కమిషన్ సభ్యుడు ఆనంద్ సూచించారు. ఏన్కూరులోని కేజీబీవీ, బాలికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలతో పాటు హిమామ్‌నగర్‌లో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. కేజీబీవీలో సరుకులను పరిశీలించిన ఆయన కోడిగుడ్లు చిన్నగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గంటా శ్రీలత, డీఎస్‌ఓ చందన్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ రాజేందర్, ఉద్యోగులు రాజశేఖర్, దయామణి, సీహెచ్.శేషగిరిరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం శ్రీరామ పునర్వసు దీక్షలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో పునర్వసు నక్షత్రం రోజున శ్రీరామ దీక్షలను భక్తులు స్వీకరించడం ఆనవాయితీ. శ్రీరామ మాలను స్వీకరించేందుకు తరలివచ్చిన పలువురు భక్తులు తొలుత పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించాక ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కాగా డిసెంబర్ 17 మార్గశిర పునర్వసు రోజున ఈ దీక్షల విరమణ ఉంటుంది. ఆ రోజు గిరి ప్రదక్షిణ, పాదుకా పూజ, సాయంత్రం వెండి రథ సేవ, 18న శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కేలెండర్లు, డైరీల ఆవిష్కరణ..

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర కేలెండర్లు, డైరీలను బుధవారం ఆవిష్కరించారు. అంతరాలయంలో రామయ్య పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజల అనంతరం ఈఓ ఎల్.రమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామి వారి అవతారాలు, ప్రధాన ఉత్సవాలకు సంబంధించి చిత్రాలతో అందంగా తయారు చేసిన కేలెండర్లు భక్తుల కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు ఈ ఏడాది డైరీలను సైతం తయారు చేయించి విక్రయశాలల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాలల్లో విధిగా మెనూ పాటించాలి



పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

ఎర్రుపాలెం: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలులో విధిగా మెనూ పాటించాలని, తద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు జెడ్పీహెచ్‌ఎస్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆమె సమస్యలు తెలుసుకున్నారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆమె ఉపాధ్యాయులు, నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని భీమవరంలో ఇటీవల మృతి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు ఎస్.కే.సైదాసాహెబ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందచేశారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, ఎంపీఈఓ జి.శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు దినేష్, శివుడు పాల్గొన్నారు.

మధిర బీఆర్‌ఎస్‌లో విభేదాలు

- ఇటీవల భేటీలో ఇరువర్గాల వాగ్వాదం
- శ్రేణులను ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురి ఆవేదన

మధిర: మధిర నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీలో మరోమారు విబేధాలు బయటపడ్డాయి. జిల్లాలో మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్న నేపథ్యాన ఖమ్మంలో మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మధిర మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంతకాలంగా మధిరలోని పార్టీ కార్యాలయం మూతబడినా నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యకర్తలకు ఆపద వస్తే స్పందన లేక శ్రేణులు మనోధైర్యం కోల్పోతున్నారని వివరించారు. అంతేకాకుండా నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీని వీడిపోతుంటే అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని చెప్పారు. ఇంతలోనే ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు కలగచేసుకుని పార్టీ బాగానే ఉందని చెబుతూ కార్యాలయం తీయాల్సిన బాధ్యత మండల అధ్యక్షులపైనే ఉంటుందని పేర్కొన్నారు. మధిర అంశాలు మాట్లాడుతుంటే సాంబశివరావు అడ్డుతగలడంపై శ్రీనివాసరావుకు తోడు మధిర పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు, నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, మొండితోక జయాకర్, బిక్కి కృష్ణ ప్రసాద్, అబ్బూరి రామన్ అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక సాంబశివరావు పార్టీ అధిష్టానాన్ని బహిరంగంగా విమర్శించారని, పోలింగ్‌కు ముందు కేసీఆర్, కేటీఆర్‌ను దూషించారని గుర్తు చేయడంతో సాంబశివరావును తాతా మధు బయటకు పంపించడం వివాదం సద్దుమణిగింది.

'స్థానిక' ఎన్నికల వేళ వలసలు

మధిర నుంచి గెలిచిన మల్లు భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తున్నారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్‌ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు. అయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కానీ ఇతర నేతలు కానీ శ్రేణులను సమన్వయం చేసుకోవడంలో విఫలమవుతున్నారని పలువురు చెబుతున్నారు. మధిరకు చెందిన ఆరుగురు మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడం ఇందుకు నిదర్శనంగా వివరిస్తున్నారు. కాగా, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు గాను మూడు మండలాల అధ్యక్షులు ఇన్‌చార్జ్ తీరుపై ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యాన ఇన్‌చార్జ్‌ను మార్చాలని వారు అంతర్గత సమావేశాల్లో నాయకుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

లష్కర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్

ఖమ్మంఅర్బన్: నీటి వనరుల పర్యవేక్షణ కోసం లష్కర్లను నియామకానికి అనుమతి లభించింది. నీరు ఎక్కడా వృథా కాకుండా, సాగునీరు సక్రమంగా అందేలా పర్యవేక్షణకు లష్కర్లను ఏర్పాటుచేసుకోవాలని జలవనరులశాఖ ఈఎన్‌సీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. లష్కర్లు లేని ప్రాంతాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇస్తూ 45ఏళ్లలోపు వారిని నియమించుకోవాలని సూచించారు. దీంతో జిల్లాలో 225 మంది నియామకం కోసం అధికారులు కసరత్తు ప్రారంభించారు.

రోడ్డెక్కిన పత్తి రైతులు

- సమాచారం లేకుండా కొనుగోళ్లు నిలిపివేయడంతో ధర్నా
- ఆంక్షలు తొలగించాలని కొనుగోళ్లకు రాని వ్యాపారులు
- అధికారుల హామీతో విరమణ

జూలూరుపాడు: కమీషన్ తీసుకోవద్దని, పత్తి క్వింటాకు రెండు కిలోల తారం తీయొద్దని అధికారులు ఆంక్షలు విధించడంతో వ్యాపారులు బుధవారం స్థానిక ఉప మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. అయితే, ముందస్తు సమాచారం ఇవ్వకుండా తాము వాహనాల్లో పత్తి తీసుకొచ్చాక ఇలా చేయడం సరికాదంటూ రైతులు తల్లాడ – కొత్తగూడెం రహదారిపై ధర్నా చేపట్టారు. ఓ పక్క దిగుబడి లేక, ధర రాక ఇబ్బంది పడుతున్న తమను మరింత ఇక్కట్లకు గురిచేయొద్దని డిమాండ్ చేశారు. రైతులకు సీపీఎం, సీపీఐ నాయకులు మద్దతు పలకగా రెండు వైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌లో నిలిచిపోయిన బీఆర్‌ఎస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ రైతులతో మాట్లాడి విషయాన్ని కలెక్టర్ పాటిల్‌కు ఫోన్‌లో వివరించారు. అంతలోనే పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు యాసా నరేశ్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

రైతులను ఇబ్బంది పెట్టకుండా నిబంధనల మేరకు పత్తి కొనుగోలు చేయాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. జూలూరుపాడులో రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలియడంతో ఆయన చేరుకున్నారు. అప్పటికే రైతులు ఆందోళన విరమించగా, పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈ మేరకు వ్యాపారులతో మాట్లాడిన ఆయన ఏదైనా సమస్య ఉంటే రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలే తప్ప కొనుగోళ్లు నిలిపివేయొద్దని హెచ్చరించారు. అలాగే, మార్కెటింగ్ శాఖ ఖమ్మం జిల్లా అధికారి ఎం.ఏ.అలీం కూడా వచ్చి కొనుగోళ్లను పరిశీలించి వ్యాపారులతో సమావేశమయ్యారు. కమీషన్, తరుగు సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు 8 నుంచి 12 శాతం మేర తేమ ఉండేలా పత్తి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. కాగా, ఖమ్మం జిల్లాలో తొమ్మిది కేంద్రాలు ఇప్పటి వరకు 5 వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేశాయని తెలిపారు. ఏన్కూరు మార్కెట్ కార్యదర్శి బజారు, సూపర్‌వైజర్ రామారావు, వ్యాపారులు పెండ్యాల రామనర్సింహారావు, తొండెపు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి మిల్లులో కార్మికుడి మృతి

- పత్తి మీద పడడంతో ఊపిరి ఆడక కన్నుమూత

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా పరిధిలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన మాధవన్(20) కొన్నాళ్లుగా మిల్లులో పనిచేస్తుండగా మంగళవారం రాత్రి పత్తి బేళ్లపై నిద్రించాడు. అయితే, అర్ధరాత్రి చలి పెరగడంతో పక్కనే కుప్పగా వేసిన పత్తిలో పడుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించని యంత్రం డ్రైవర్ పత్తిని తీస్తుండగా మాధవన్‌పై పడడంతో ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యాడు. కాసేపయ్యాక సహచర కార్మికులకు మాధవన్ కనిపించకపోవడంతో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి పత్తిలో కూరుకుపోయినట్లు గుర్తించారు. ఆపై వాహనంలో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, వారు చేరుకున్నాక అజాగ్రత్తగా యంత్రాన్ని నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఇమ్రాన్

సత్తుపల్లి: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఇమ్రాన్ బేతుపల్లికి చెందిన నందినిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఇరువురి మధ్య గొడవలు మొదలవడంతో నందిని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో బుధవారం బేతుపల్లికి వెళ్లిన ఇమ్రాన్ తన భార్యను పంపించాలని ఆమె కుటుంబీకులను బెదిరిస్తూ బ్లేడ్‌తో పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈమేరకు ఆయనను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి నుంచి పారిపోయే యత్నం చేయడంతో కుటుంబీకులు, ఆస్పత్రి సిబ్బంది పట్టుకుని చికిత్స చేశారు. గతంలో కూడా ఇమ్రాన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంకు చెందిన కొమ్ము మహేందర్ (55) గ్రామ సమీపంలోని మున్నేరులో బుధవారం చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆయన సాయంత్రమైనా ఇంటికి రాకపోవటంతో కుటుంబీకులు, గ్రామస్తులు మున్నేరు వద్దకు వెళ్లి వెతికారు. అయినా ఫలితం లేక పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై నాగుల్‌మీరా.. అగ్నిమాపక సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లను పిలిపించి రాత్రి వరకు గాలించినా మహేందర్ ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఉదయం మళ్లీ గాలింపు చేపడుతామని ఎస్సై తెలిపారు.

పింఛన్ల సాధనకు 26న 'చలో హైదరాబాద్'



దీక్షలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఖమ్మం మామిళ్లగూడెం: పింఛన్ల నగదు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పడాన్ని నిరసిస్తూ వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యాన ఈనెల 26న చలో హైదరాబాద్ చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ చెల్లించాలనే డిమాండ్‌తో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యాన బుధవారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన మంద కృష్ణ మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు దివ్యాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే, ఏడాది కావొస్తున్నా హామీ అమలులో నిర్లక్ష్యం చేస్తున్నందున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈనెల 26న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు సీతారాములు, జీవరత్నం, నాగరాజు, భూలక్ష్మి, సైదులు, భద్రయ్య, ఉపేంద్ర, శ్రీను, వీరస్వామి, వెంకయ్య, రాంబాబు, సైదాబీ, మంగమ్మ, ఏపూరి వెంకటేశ్వరావు, అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వరావు, సునీల్, రాము, నాగేశ్వరావు, శ్రీను, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఐదుగురికి ఏఎస్సైలుగా పదోన్నతి



ఉద్యోగోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న పోలీసు కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురికి ఇటీవల ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఉద్యోగోన్నతి పొందిన షేక్ నూరుద్దీన్, నాగేశ్వరరావు, బీవీఆర్.రాజు, చిన్నారావు, శ్రీనివాసరావు గురువారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను కలవగా ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

సీతారాములుకు అభినందనలు

నేలకొండపల్లి: నేలకొండపల్లి హెడ్ కానిస్టేబుల్ కమర్తపు సీతారాములుకు ఏఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం ఆయనను ఎస్సై పి.సంతోష్ అభినందిచగా, ఏఎస్సై కోడే త్రాచు, ఉద్యోగులు ఖాసిం, ఎం.రామకృష్ణ, రాజేష్, హరి, చరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

రఘునాథపాలెం: జాతీయ స్థాయి ఆరోగ్య కార్యక్రమాలు నూరు శాతం అమలయ్యేలా వైద్యులు, సిబ్బంది శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి సూచించారు. మండలంలోని మంచుకొండ పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసిన ఆమె వైద్యసేవలు, వ్యాక్సినేషన్‌పై ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం రాంక్యాతండాకు మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే, గ్రామంలో మెడికల్‌షాపులో తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొవద్దని ఆదేశించారు. ఆతర్వాత పుటానితండాలో వ్యాక్సినేషన్‌ను, రఘునాథపాలెం ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చందూనాయక్, పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గోలి రమాదేవి పాల్గొన్నారు.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా శ్రీనివాసరెడ్డి



ఎంపీని సత్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) మెంబర్‌గా కొత్తగూడెంనకు చెందిన యరమల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో నియమితులైన ఆయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఎంపీని బుధవారం ఖమ్మంలో కలిసిన శ్రీనివాసరెడ్డి తన నియామకానికి సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా రైల్వే బోర్డు సమావేశాల్లో చర్చించాలని ఎంపీ ఆయనకు సూచించారు. నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. వైరా సీఐ సాగర్, ఎస్సై నాగుల్‌మీరా ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడమేకాక యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, మండలంలోని చిన్నమండవ, తిమ్మినేనిపాలెం మున్నేరు నుంచి ఇసుక తరలింపునకు అడ్డుకట్ట వేసేలా సిబ్బంది గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు.

చంద్రబాబు భాషకు అర్థాలు వేరు
బాదడమే సంపద సృష్టి!

ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు.. అదేనా నీ సూత్రం?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'సంపద సృష్టి అంటే ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు బాదడమేనా? మేం సృష్టించిన సంపద మెడికల్ కాలేజీలు, పోర్టులను స్కామ్‌ల కోసం అమ్మేయడమేనా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నిలదీశారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానన్న ప్రతిసారి ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'సంపద సృష్టిస్తా' అన్నది చంద్రబాబు ఊత పదం (కామన్ డైలాగ్)గా మారిందని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు సంపద సృష్టిలో భాగంగా మెడికల్ కళాశాలలను, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులను అమ్మేస్తున్నారు. పోర్టులకు సంబంధించి దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మారిటైం బోర్డు పెట్టి పోర్టుల నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఫైనాన్షియల్ టై అప్ చేశాం. బ్యాంకులు ప్రత్యేకంగా లోన్లు ఇస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కడుతున్న పోర్టులు, మెడికల్ కాలేజీలు భవిష్యత్తులో రూ.లక్షల కోట్ల సంపద అవుతుంది. నాగార్జునసాగర్ కట్టడానికి అప్పట్లో రూ.600 కోట్లు–రూ.900 కోట్లు అయినట్టుంది. ఇప్పుడు సాగర్ లాంటి ప్రాజెక్టును కట్టాలంటే ఎన్ని వేల కోట్లు కావాలి? ఈ రోజు కట్టే పోర్టులు, వైద్య కళాశాలల విలువ కూడా అంతే. ఇలాంటివి కడితేనే రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం తయారవుతుంది. దీన్ని సంపద సృష్టి అంటారు. చంద్రబాబు మాత్రం సంపద సృష్టి పేరుతో స్కామ్‌లు చేస్తున్నారు. తనకు కావాల్సిన వాళ్లకు పోర్టులు, వైద్య కళాశాలలను అమ్మేస్తున్నారు' అని మండిపడ్డారు. 'కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై టోల్ వసూలు చేస్తున్న మాదిరిగా గ్రామీణ రహదారులపైనా రాష్ట్ర ప్రభుత్వం టోల్ వసూలు చేయాలని అసెంబ్లీలో చంద్రబాబు చెబుతున్నారు. అంటే ప్రయాణికులు రోడ్లపై తిరిగే దానికి యూజర్ చార్జీలు వసూలు చేస్తారట. దీనినే సంపద సృష్టిగా చంద్రబాబు అభివర్ణిస్తున్నారు. పన్నులతో బాదేసి సంపద సృష్టి అంటే ఆశ్చర్యంగా ఉంది. పైగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు రోడ్లపై విపరీతమైన దుష్ప్రచారం చేశారు. వాళ్ల ఐదేళ్ల కాలంలో రోడ్ల కోసం రూ.24,792.19 కోట్లు ఖర్చు చేస్తే, మా హయాంలో రూ.43,036.28 కోట్లు వెచ్చించాం. ఇంత ఖర్చు చేసినా కూడా దుష్ప్రచారం ఎదుర్కొన్నాం. బాబు మాత్రం నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు' అని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

బినామీలకు దోచిపెట్టేందుకే అసైన్డ్‌పై దుష్ప్రచారం

- అసైన్డ్ భూములపై నిస్సిగ్గుగా అబద్ధాలు.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మా ప్రభుత్వం రాక ముందు పేరుకే దళితులకు భూమి ఉండేది. దానిని అమ్ముకునే స్వేచ్ఛ లేదు. ఇంట్లో వాళ్లకు అత్యవసర పరిస్థితులు ఎదురైనా, వారసుల పేరుపైకి బదిలీ చేయాలన్నా అగమ్యగోచర పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకోలేని నిస్సహాయ స్థితిలో శనక్కాయలకు.. పావలాకు, పది పైసలకు వేరే వాళ్లు కొనుక్కొని అనుభవించే వారు.
- మేము అధికారంలోకి వచ్చాక పేదల జీవితాలు మార్చాలని ఆలోచించాం. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూమి ఉన్న వారికి చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పిస్తూ సొంత భూములుగా మార్చాం. ఆ సొంత భూములను అమ్ముకుంటారా? వాళ్ల పిల్లలకు ఇచ్చుకుంటారా? వాళ్ల ఇష్టం. ఈ లోగా ఎవరైనా భూములు కొనుగోలు చేసి ఉంటే కూడా అవన్నీ ఒరిజినల్ అసైనీలకు వెళ్లిపోతాయి. వాళ్ల పేరుతోనే పట్టా వస్తుంది. కొన్న వాళ్లకు పట్టా రాదు. ఇలా హక్కులిచ్చి 15.21 లక్షల మంది రైతులకు, పేదలకు మంచి చేస్తే కూటమి నాయకులు నిస్సిగ్గుగా బురద వేస్తున్నారు. మళ్లీ పేదల దగ్గర నుంచి హక్కులు తీసుకోవడానికి అడుగులు వేస్తున్నారు. చట్టాన్ని రద్దు చేయడం ద్వారా వారి హక్కులను రద్దు చేయనున్నారు. ఆ తర్వాత అవే భూములను పెత్తందార్లు 10 పైసలకు, 20 పైసలకు కొనుక్కోవచ్చు. వీళ్లకు మాత్రమే మంచి రేటు ఉండాలి. పేదలకు మాత్రం మంచి రేటు రాకూడదు.
- చంద్రబాబు ఇచ్చిన ఒక మెమో ద్వారా 2.06 లక్షల ఎకరాలను ఉద్దేశ పూర్వకంగా నిషేధిత జాబితా (22ఏ)లో పెట్టారు. 98 వేల మంది రైతులను నానా కష్టాలకు గురి చేస్తున్నారు. మేము నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించి.. రైతుల భూమిపై చంద్రబాబు చేసిన దాష్టీకం నుంచి విడుదల చేశాం. వారి భూములపై సర్వ హక్కులు కల్పించాం. అది తప్పంటున్నారు.

ఐదేళ్లలో ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చావా?

- చంద్రబాబు హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి కనీసం ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా? మేము 30.60 లక్షల కుటుంబాలకు అక్కచెల్లెమ్మల పేరుపైనే రిజిస్ట్రేషన్ చేసి ఇంటి స్థలాలు ఇచ్చాం. ఇందులో 21 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం. 9.02 లక్షల ఇళ్లను పూర్తి చేశాం. మిగిలిన 11 లక్షల ఇళ్లు పునాదులు దాటి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఏకంగా 17 వేల జగనన్న కాలనీల్లో ఏకంగా ఊళ్లే తయారవుతున్నాయి. ఆ ఇళ్లన్నీ పూర్తయితే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతో చంద్రబాబు హౌసింగ్ కార్యక్రమాన్ని ఆపేశారు.
- మా ప్రభుత్వ హయాంలో సిమెంట్, స్టీలు, ఇతర సామగ్రిని సబ్సిడీపై, ఇసుకను ఉచితంగా ఇచ్చే వాళ్లం. ఇవి కాకుండా రూ.35 వేలు పావలా వడ్డీకి రుణంగా ఇచ్చే వాళ్లం. రూ.1.80 లక్షల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించే వాళ్లం. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిలిపి వేసినందుకు నిరుపేదలందరూ చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకుంటున్నారు. పేదల ఇళ్ల గురించి ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. ఎందుకు అసెంబ్లీ నడుపుతున్నారో.. ఎందుకు ప్రభుత్వాన్ని నడుపుతున్నారో వీళ్లకే తెలీదు.

మరిన్ని వార్తలు, వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మద్యం, ఇసుక అంతా స్కామ్..

- రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన పనులు పూర్తిగా పక్కకు వెళ్లిపోయాయి. ఎక్కడ చూసినా మాఫియా ముఠాలు దోచుకుంటున్న పరిస్థితి. చంద్రబాబు అధికారంలోకి వస్తే నాణ్యమైన లిక్కర్ ఇస్తానన్నారు. మద్యం రేటు తగ్గిస్తానన్నారు. ఆశ్చర్యం ఏమంటే.. గతంలో చంద్రబాబు హయాంలో అవే డిస్టలరీలు.. మా హయాంలో అవే.. ఇప్పుడు కూడా అవే డిస్టలరీలు. మద్యం ఆదాయంలో చీప్ లిక్కర్ నుంచే 85 శాతం వస్తుంది. చంద్రబాబు వచ్చిన తర్వాత చీప్ లిక్కర్‌లో నాణ్యత తగ్గించారు. ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్త బ్రాండ్లను తీసుకొచ్చారు. ఎప్పుడూ మనం వినని, చూడని బ్రాండ్లు అవి.
- అన్ని చోట్లా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో బెల్టు షాపునకు.. ఒక్కో గ్రామంలో పోటీ పెట్టి వేలం వేస్తున్నారు. రూ.2 లక్షలకు పాడుకున్న వాడికే ఇస్తున్నారు. ఇలా మాఫియా రాజ్యం నడుస్తోంది. మద్యాన్ని ఎమ్మార్పీకి అమ్మకోవాలంటే పోటీ ఎందుకు? ఎమ్మెల్యేలు మనుషులను ఎందుకు కిడ్నాప్ చేయించాలి.. ఎందుకు ఎవరినీ పాడనివ్వకుండా చేయాలి? వేరేవాళ్లకు వచ్చినా షాపులు నడుపుకోలేని పరిస్థితికి ఎందుకు నెట్టేయాలి? ఎమ్మార్పీ ప్లస్ మాఫియాకు కమిషన్ రావాలనే ఇదంతా చేస్తున్నారు. ప్రభుత్వం నడుపుతున్న షాపులన్నీ తీసేశారు. ప్రైవేటు మాఫియాను తీసుకొచ్చి అన్ని రకాలు స్కాములకు తెరదీశారు. ఇసుక పరిస్థితి కూడా అంతే. హామీ ఇచ్చినట్లు ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. గతంలో ఆ డబ్బు ప్రభుత్వ ఖజానాకు చేరేది. ఇప్పుడు అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళ్తోంది.

మోసాలు, అక్రమాలు, వైఫల్యాలు నిలదీస్తే అక్రమ కేసులా?

- సూపర్ సిక్స్‌లు లేవు.. సూపర్‌సెవెన్‌లు లేవు.. మరో వైపు అన్ని రకాలుగా రాష్ట్రం వైఫల్యం చెందింది. ఎవరైనా హక్కుల కోసం, న్యాయం కోసం సోషల్ మీడియాలో ప్రస్తావిస్తే చాలు దారుణంగా వేధిస్తున్నారు. పోలీసులను అన్యాయంగా వాడుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా వాళ్ల నియోజకవర్గాల్లో ప్రైవేటు మాఫియా ముఠాను తయారు చేసి కొట్టిస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఇష్టానుసారంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమ నిర్బంధాలు (ఇల్లీగల్ డిటెన్షన్) చేస్తున్నారు. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.
- రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని తప్పుడు సంప్రదాయానికి నాంది పలుకుతున్నారు. ఒక వైపు కేసులు పెట్టడం, మరొక వైపు ఎవరైనా మాట్లాడితే అన్యాయంగా దూషించడం. ఇంకొక వైపు దుష్ప్రచారాలు చేయడం. ఇది చంద్రబాబు నైజం. టాపిక్ డైవర్షన్, తప్పుడు ప్రచారం, అబద్ధాలు, మోసాలు చేయడంలో చంద్రబాబు స్పెషలిస్ట్. ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననం (క్యారెక్టర్ అసాస్‌నేట్) చేయడంలో ప్రసిద్ధుడు. లక్ష్మీపార్వతితో మొదలు నా వరకు ఎలా ప్రచారం చేశారో చూశాం.

నా చెల్లిపై దుష్ప్రచారం చేసింది చంద్రబాబే

- చంద్రబాబు తప్పుడు ప్రచారంపై గతంలో నా చెల్లెలు షర్మిల ఏమన్నారో చూడండి. (వీడియోను ప్రదర్శిస్తూ..) ఆ వీడియోలో షర్మిల మాట్లాడుతూ.. 'ఎన్టీఆర్ బిల్డింగ్ నుంచి దుష్ప్రచారం జరిగిందని ఐపీ అడ్రస్‌ను బట్టి పోలీసులు చెబుతున్నారు. ఈ వెబ్‌సైట్‌లన్నీ ప్రో టీడీపీ ప్రమోట్ చేసినవే. ప్రత్యర్థులను కించపరిచేవి. ఈ పోస్టింగ్‌లన్నీ బాలకృష్ణ బిల్డింగ్ నుంచి, ప్రో టీడీపీ సైట్‌ల నుంచి జరిగాయంటే బాలకృష్ణకు సంబంధం లేదని నేను ఎలా అనుకోవాలి? సంబంధం ఉంది కనుకే బాలకృష్ణ నా మీద నింద వేశారని, పుకార్లు పుట్టించారని, వాటిని ప్రచారం చేశారని నేను విశ్వసిస్తున్నా. బాలకృష్ణ ఇలా దిగజారుడు తనానికి ఎందుకు పాల్పడ్డారో ఆయనే చెప్పాలి.
- మా ప్రభుత్వ హయాంలో వర్రా రవీంద్రర్‌రెడ్డి పేరిట ఐ టీడీపీ సభ్యుడు ఉదయ్‌భూషణ్ ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి మా అమ్మను, మా చెల్లెలిని తిట్టించాడు. వర్రా రవీంద్రరెడ్డి పెట్టిన కేసు ఆధారంగా ఫిబ్రవరిలోనే ఉదయ్‌భూషణ్‌ను ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. చంద్రబాబు ఎంత దారుణమైన నికృష్టుడంటే తన స్వార్థం కోసం ఎవరినైనా సరే వ్యక్తిత్వ హననం చేస్తాడు. వాళ్ల సానుభూతిపరులతో ఫేక్ ఐడీ క్రియేట్ చేయించి, వాళ్లతో మన వాళ్లను తిట్టిస్తాడు. మళ్లీ మనం తిట్టించామని బయట ప్రచారం చేస్తాడు. ఇటువంటి మనిషి ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండదు. చాలా అరుదుగా పుడతారు ఇలాంటి రాక్షసులు. మన కర్మ ఏంటంటే ఈయన మన రాష్ట్రంలో పుట్టడం. చంద్రబాబు నైజం ఎలా ఉంటుందో ఇంతకంటే ఇంకేం చెప్పమంటారు?



బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

'ప్రాసిక్యూటర్స్' అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంరెడ్డి



రాంరెడ్డి



కె.శ్రీవాణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్ అండ్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరి రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన ఈ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఈనెల 19న జరిగాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేడర్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. ఈమేరకు ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫలితాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణ, పి.రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీవాణి (ఏపీపీ గ్రేడ్–1), ట్రెజరర్‌గా ఆర్.రాఘవేందర్, అదనపు కార్యదర్శులుగా కె.శంకర్, జి.ప్రణయ్ ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే మహిళా ప్రతినిధిగా సాంబ దుర్గాబాయ్, సునీతతో పాటు 11 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. పీపీల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా వార్తలు

24న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక బాధ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు వెల్లడించారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం వారు మాట్లాడారు. ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగే సమ్మేళనానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,500 మంది వరకు హాజరుకానుండగా, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఏపీ మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎస్ఎఫ్ఐ జెండాను సీనియర్ నాయకులు ఆవిష్కరించనుండగా, ప్రొఫెసర్ నాగేశ్వర్, వి.కృష్ణయ్య, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఐసీ.ఘోష్ మాట్లాడుతారని తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి పూర్వ విద్యార్థుల కళా సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. కాగా, సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు 22మందితో కమిటీని నియమించినట్లు తెలిపారు. సమ్మేళనం కోకన్వీనర్ రాజేశ్వరరావుతో పాటు ఎస్.డి.జావిద్ పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుట్ట శంకరయ్య తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని క్రీడా పాఠశాల మైదానంలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారితో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా స్థాయి జట్టును ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

అన్నదాన ప్రభువే.. శరణం అయ్యప్పా..

- కొత్తగూడెం శ్రీ ధర్మశాస్తా ఆలయంలో మాలధారులకు నిత్యాన్నదానం
- 24ఏళ్లుగా మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం
- ఏటా నవంబర్ 15నుంచి జనవరి 10వరకు నిర్వహణ



కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మశాస్తా ఆలయం

కొత్తగూడెంటౌన్: అయ్యప్ప మాల ధరించే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. అయితే, స్వస్థలంలో ఉండే వారికి మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారానికి ఇబ్బంది లేకున్నా ఇంట్లో ప్రత్యేక వంట చేసే పరిస్థితులు లేని వారు, పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సమస్య ఎదుర్కొంటారు. ఈ నేపథ్యాన కొత్తగూడెంలోని శ్రీధర్మశాస్తా ఆలయంలో గత 24ఏళ్లుగా మాలధారులకు మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం ఉచితంగా సమకూరుస్తున్నారు.

అరటి ఆకుల్లో సద్ది..

కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మ శాస్తా ఆలయానికి కార్తీక మాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇందులో అయ్యప్ప మాల ధరించిన వారు వందల సంఖ్యలో ఉంటారు. పట్టణ వాసులకే కాక మాల ధరించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి సైతం ఈ ఆలయంలో ఏటా నవంబర్ 15నుంచి జనవరి 10వ తేదీ వరకు మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం ఉచితంగా సమకురుస్తున్నారు. పెనగడపలోని తోటల నుంచి అరటి ఆకులు తెప్పించి భోజనం వడ్డిస్తుండడం విశేషం. దీంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి పనులపై వచ్చిన భక్తులు సైతం ఇక్కడ 'సద్ది' స్వీకరిస్తారు. దాతల సాయంతో 2000 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా రోజూ మధ్యాహ్నం 400 మందికి పైగా మాలధారులకు భోజనంతో పాటు రెండు రకాల కూరలు, మజ్జిగ సమకూరుస్తున్నారు. ఇక రాత్రి ఉప్మా, ఇడ్లీ, వడ వంటి అల్పాహారం అందిస్తున్నారు.



ఆలయంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

నిత్యాన్నదానం మా అదృష్టం..



మాలధారులకు 24 ఏళ్లుగా ఉచిత నిత్యాన్నదానం చేస్తున్నాం. ఇందుకు దాతల నుంచి సహకారం అందుతోంది. అయ్యప్ప దీక్ష స్వీకరించే భక్తులకు భోజనం, అల్పాహారం అందించడాన్ని మా అదృష్టంగా భావిస్తున్నాం. మధ్యాహ్నం 400మందికి పైగా, రాత్రి సుమారు 150 మంది ఇక్కడ అల్పాహారం స్వీకరిస్తారు. – కన్నెగంటి కృష్ణమూర్తి, శ్రీధర్మశాస్తా ఆలయ ప్రధాన కార్యదర్శి

గత 20 ఏళ్లుగా మాల ధరిస్తున్నా...



నాకు అయ్యప్ప అంటే భక్తి. గత ఇరవై ఏళ్లుగా నేను మాల ధరిస్తున్నా. మాలధారణ సమయంలో నిత్యం పూజలు, భజనలు చేస్తుంటాం. అలాగే, స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మాలధారులకు దాతల చేయూతతో మధ్యాహ్న భోజనంతో పాటు రాత్రి అల్పాహారం అందజేస్తున్నాం.

– జక్కుల విజయ్‌కుమార్, కొత్తగూడెం

ఇరవై ఏళ్లుగా ఇక్కడే సద్ది...



నేను అయ్యప్ప మాల ఇరవై ఏళ్లుగా ధరిస్తున్నా. ఏటా మాలధారణ సమయంలో మధ్యాహ్న భోజనంతో పాటు రాత్రి అల్పాహారం సైతం ఇక్కడే తీసుకుంటాం. భక్తిభావంతో వంటలు చేసి మాలధారులకు సమకూరుస్తారు. భక్తులు ఇబ్బంది పడకుండా నిత్యాన్నదానం చేయడం అభినందనీయం.

– గరినే శ్రీనివాసరావు, కొత్తగూడెం

48 రోజుల దీక్ష తర్వాతే ఇరుముడి ఉత్తమం



మాట్లాడుతున్న వెంకటేష్‌శర్మ, పక్కన మాలధారులు

సత్తుపల్లిటౌన్: అయ్యప్ప మాలధారులు నియమనిష్టలతో 48 రోజుల దీక్ష చేశాకే ఇరుముడి కట్టుకోవాలని కేరళ మేలు తంత్రి చంద్రమౌళి వెంకటేష్‌శర్మ తెలిపారు. సత్తుపల్లిలోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. మాలధారణ చేసిన భక్తులు ఇంట్లో లేదా ఆలయాల్లో సాత్విక ఆహారం తీసుకోవాలే తప్ప రహదారి వెంట ఆహారం తీసుకోవడం సరికాదన్నారు. పదేళ్లలోపు బాలికలు, 55ఏళ్లు నిండిన మహిళలు శబరిమలైలో స్వామిని దర్శించుకోవచ్చని, అక్కడికి వెళ్లలేని వారు స్థానిక ఆలయాల్లో స్వామిని దర్శించుకోవచ్చన్నారు. కాగా, మకర సంక్రాంతి రోజున వందల ఏళ్లుగా శబరిమలలో ఉత్తర నక్షత్రం రూపంలో స్వామి దర్శనం ఇస్తారని తెలిపారు. అలాగే, అటవీ ప్రాంతాల వారు ఇచ్చే హారతే మకరజ్యోతి అని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఆలయ కమిటీ బాధ్యులు దోసపాటి అమరలింగేశ్వరరావు, వందనపు సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, దురిశెటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ఆదివాసీ గిరిజన మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. దమ్మక్క లయాబిలిటీ గ్రూప్ సభ్యులు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటుచేసిన షాపును రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి పీఓ ప్రారంభించారు. షాపులో సబ్బులు, షాంపూలు, తేనె, వెదురుతో రూపొందించిన కళాఖండాలను పరిశీలించాక పీఓ మాట్లాడారు. భద్రాచలం క్షేత్రానికి వచ్చే భక్తులకు నాణ్యతమైన వస్తువులు అమ్మడం ద్వారా మంచి పేరు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, జీసీసీ డీఎం సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా చదివితే లక్ష్యసాధన

విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివితే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులువవుతుందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. దుమ్ముగూడెంలోని ఈఎంఆర్ఎస్ కళాశాలను తనిఖీ చేసిన ఆయన రికార్డులు, తరగతి గదులను, డైనింగ్ హాల్, వంటశాలలను పరిశీలించాక పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. కేవలం చదువుపైనే దృష్టి సారించి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. అలాగే, క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పియానో కీబోర్డ్, హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న పీఓ రాహుల్, పొదెం వీరయ్య తదితరులు

రామయ్య దర్శనం.. నయనానందకరం

భద్రాచలంటౌన్: ఏపీలోని విజయనగరం జిల్లా వావిలవలస గ్రామానికి చెందిన రాహుల్‌సౌరభ్ వృద్ధాశ్రమంలో ఉంటున్న 20 మంది వృద్ధులు బుధవారం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. కార్తీక మాసంలో తెలుగు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రలను సందర్శించేలా సహకరించాలని వారు ఏపీ ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణను కోరారు. దీంతో ఆయన ఆలయాల సందర్శనకు ఏర్పాట్లు చేయించగా భద్రాచలం వచ్చారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ రమాదేవి దర్శనం చేయించడంతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించారు.



ఆలయం వద్ద వృద్ధులు, ఆశ్రమం బాధ్యులు

తోటంతా పూత.. ధవళ వర్ణంతో శోభ!



వాణిజ్య పంటలతో పాటే పలువురు రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు. చిక్కుడుకాయలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడమే కాక మెరుగైన ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యాన అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం, నారంవారిగూడెం కాలనీ, కొత్త నారంవారిగూడెం, మద్దికొండ, అచ్యుతాపురం, పేరాయిగూడెం, వినాయకపురం తదితర గ్రామాల్లో పలువురు చిక్కుడు తోటలు సాగు చేస్తున్నారు. వినాయకపురం వద్ద ఓ రైతు సాగు చేస్తున్న చిక్కుడు తోట విరబూసి ధవళ వర్ణాన్ని సంతరించుకోగా, ప్రధాన రహదారిపై వెళ్తున్న వారు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. – అశ్వారావుపేట రూరల్